


ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ

# ఒక్కడు చాలు

-దోరవేటి

'అప్పులేని సంసారం అయినపాటి చాలు...' అంటూ అయిదు వందల సంవత్సరాలనాడే మహానుభావుడు అన్నమయ్య సెలవిచ్చాడు. ఆశావాదులు, దురాశావాదులు 'అప్పుచేసి పప్పుకూడు తినం'డని లొట్టలేసినా ఆపై ఎన్నెన్ని తిప్పలు పడాల్సి వస్తుందో అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. చాలావరకు అప్పులు ఆనందంతో మొదలై విషాదంతో అంతమవుతాయి. ఈ ప్రపంచం నుండి అప్పును పూర్తిగా తరిమేసి, 'ఎయిడ్స్ ఫ్రీ జోన్'లా 'అప్పు ఫ్రీ' ప్రపంచాన్ని ఏర్పరస్తే...?

తన ఆలోచనలు తనకే నవ్వును తెప్పించాయి శ్రీనివాస్‌కి. ఫ్రీ జోన్ సంగతి సరే, అసలు అప్పులేని చోటును కనిపెట్టగలమా? పుట్టుక మొదలు గిట్టేదాక నిరుపేద మొదలు దేశాధ్యక్షుల దాకా అందరూ దాని చుట్టూ గిరికీలు కొడుతున్న వారే. మనుషుల సంగతి సరే, దేశాలు కూడా అప్పుల్లో కూరుకుపోతున్నాయి. అయినా గురజాడవారు సెలవిచ్చారు కదా- ''దేశమంటే మట్టి కాదోయ్ ... మనుషులోయ్ అంటూ... ...''

''అలా ఎంతసేపు ఆలోచిస్తూ కూర్చుంటారు? ఈరోజు ఆఫీసు లేదా?'' శ్రీమతి సద్గుణ పిలుపుతో ఈ లోకంలో పడ్డాడు.

''ఆఫీసులో జీపీఎఫ్ లోన్ ఏదో ఉందన్నారు కదా! అదేమాత్రం వస్తుందో తీసుకోండి. చాలకపోతే నా గొలుసూ, గాజులూ తాకట్టు పెడదాం లేదా ఏదో ఒకటి అమ్మేద్దాం. దీనికింత ఆలోచించాలా?'' కరణేషు మంత్రిత్వం నెరపింది సద్గుణ.

''ఆc! ఆc! అదే ఆలోచిస్తున్నా...'' పాడిపాడిగా అంటూ ఆఫీసుకి బయల్దేరాడు శ్రీనివాస్.

ప్రభుత్వోద్యోగం చేస్తున్న యాభై యేళ్ల శ్రీనివాస్‌కి కుటుంబం ఎప్పుడూ భారమనిపించలేదు. దుబారాకు దూరంగా ఉండే అర్ధాంగి, దురలవాట్లు లేని అతని వ్యక్తిత్వం అందుకు ప్రధాన కారణాలు. ఇద్దరు కూతుళ్ళు, ఓ కొడుకు. గుట్టుగా కాపురం చేసుకునే శ్రీనివాస్ హైదరాబాద్‌లో ఉంటూ, ఎంతో వెనకేసి ఉంటాడని చాలామంది అపోహ. ఎంతోకొంత వెనకేయడంవల్లే పెద్దకూతురు పెళ్ళి ఎవర్నీ యాచించకుండా చేయగలిగాడు. ఇప్పుడు రెండో సంతానం ఋషి ఇంజినీరింగ్ పూర్తిచేసుకొని విదేశాలకెళ్ళే హడావుడిలో ఉన్నాడు. ఏదో కంపెనీ ఒప్పందం. లక్షా ఇరవైఅయిదు వేలు ఇప్పుడు కావాలి. అదీ అతడ్ని తొలిచేస్తున్న సమస్య.

ఎవర్నీ యాచించకుండా కూతురు పెళ్ళిచేసేసరికి పెద్దలు గుర్తొచ్చారు. ఇప్పుడు వెంటనే లక్షా ఇరవైఅయిదు వేలు... జిపిఎఫ్ ఆదుకోగలదనే నమ్మకం. సరిగ్గా ఆ క్షణంలోనే తన ప్రాణస్నేహితుడు శివానంద గుర్తొచ్చాడు. ఇంటర్ మీడియట్‌లో ఏర్పడ్డ తమ స్నేహం నానాటికీ విడదీయరాని బంధమై, ప్రతి కష్టంలో- సుఖంలో ఒకరినొకరు తలచుకునేలా చేసింది... ...

డిగ్రీ ఫైనలియర్‌లో ఉండగా తండ్రి పోవడంతో చదువుకు నామం పెట్టేసి వికారాబాద్‌కు దగ్గర్లో ఉన్న తమ ఊరు చేరుకున్నాడు శివానంద. పెద్ద కొడుకుగా పుట్టినందుకు ఊళ్ళో వ్యవసాయం పనులు చేయిస్తూ తమ్ముడ్ని చదివించాడు. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేసేశాడు. ఉద్యోగంలో చేరింతర్వాత తమ్ముడు ఆస్తిలో భాగం పంచుకొని హైదరాబాద్‌లో సెటిలైపోయాడు. శివానంద కూతుళ్ళిద్దరూ వికారాబాద్‌లో పి.జి., డిగ్రీల్లో ఉన్నారు.

పెద్ద కూతురు శ్రావణికి అనుకోకుండా సంబంధం కుదిరింది. ఎవరి పెళ్ళిలోనో చూసి, వాళ్ళకువాళ్ళుగా వచ్చి అడిగారు. మంచి సంబంధమే. శ్రీనివాస్ కూడా వచ్చి, అన్నీ చూసి 'సరే'నన్నాడు. వేసవిలో వివాహం అనుకున్నారు. కాని, రెండ్రోజుల క్రితం హఠాత్తుగా మధ్యవర్తిని పంపి, ఇప్పుడు 'మమ'అనిపించుకుంటాం- నిశ్చితార్థానికి ఏర్పాట్లు చేయించమన్నారు. ఎంత తక్కువన్నా లక్ష రూపాయల ఖర్చు... ...

పిల్లల పెళ్ళిళ్ళు చేయాల్సింది ఉందన్న స్పృహ ఉన్నా, ఇంత హఠాత్తుగా ఈ పరిస్థితి వస్తుందనుకోలేదు శివానంద. గతమంతా తోబుట్టువుల సేవలోనే కరిగిపోయింది. ఇప్పటికిప్పుడు డబ్బులు కావాలంటే తన వంతు భూమిలో కొంత భాగం అమ్ముకోవడమే. పెళ్ళికోసం ఎలాగూ ఆ పనిచేయాలని నిర్ణయించుకున్నాడు. కాని, ఇంత తొందరగా డబ్బులు కావాలంటే చూస్తూచూస్తూ ఎదుటివారిని చవగ్గా అమ్మేయాల్సి వస్తుంది... కాని, గత్యంతరం?!

''అరె, మొన్న మంచి గిరాక్ వొచ్చిండె అన్నా. గప్పుడడిగితే అమ్మేది లేదన్నవ్...'' ఇప్పుడు లాభం లేదన్న ధోరణిలో మాట్లాడాడు రియలేస్టేట్ బ్రోకర్ జానీ మియా.

అదంతా బిజినెస్ ఎత్తుగడ అని తెలుస్తూనే ఉంది శివానందకి. ''ఇప్పుడు అవసరం ఏర్పడ్డది జానీ. నువ్వైతే కొంచెం నిజాయితీగా, నాకు అనుకూలంగా చేసిపెడ్తావని నీ దగ్గరికొచ్చాను. మొత్తం డబ్బులు ఓ నెల ఆగి ఇచ్చినా సరే. ముందు అడ్వాన్స్ కావాలి. ఎంతకడుగుతున్నారేంటి?''

''గప్పుడైతే ఎకరా నాలుగు లక్షలన్నరన్నా. గిప్పుడెవ్వరడుగుత లేరు.'' వ్యాపార కిటుకు ప్రయోగించాడు జానీ మియా.

ఆశ్చర్యపోయాడు శివానంద. జానీ స్వయంగా మూణ్ణెల్ల క్రితం ఐదు లక్షలకివ్వమని బతిమాలినోడే. అప్పుడు హఠాత్తుగా ప్లేటు ఫిరాయిస్తున్నాడు. వాని పద్ధతికి అసహ్యం కల్గింది. రోజుకు రోజు రేట్లు పెరుగుతున్న తరుణంలో వీడిట్లా మాట్లాడటం జీర్ణించుకోలేకపోయాడు. 'బేరాలనవసరం' అనుకుంటూ లేచాడు.

''అరె, గదేందన్నా, మాటా- ముచ్చట లేకుండ లేస్తవ్?'' పోనీకుండా ఆపే ప్రయత్నం జానీది.

''జానీ, నువ్వు నా వాడవనుకోవడం పొరబాటు. అయినా వ్యాపారంలో మొహాలెవడు చూస్తాడు? లాభాలు తప్ప. మూణ్ణెల్లనాడు ఎకరా ఐదుకి ఇవ్వమని

"నా ఇంటి చుట్టూ తిరిగిన నువ్వే ఇప్పుడు నాలుగంటున్నావ్..." మనసులోని బాధను వెళ్ళగక్కుతున్నాడు శివానంద.

"ఓహో... గదా..." లేని నవ్వు పుసుక్కున నవ్వేసి లౌక్యం ప్రదర్శించాడు జానీ- "గప్పుడు నువ్వు ఆరన్నా ఇచ్చేటోళ్ళన్నా. గీ బిజినెస్ అంత అవలా... ఇంకొగటి లేదనుకో. నిన్నటికి నిన్న గారోడ్డు పక్కన పన్నెండన్నోడు ఈయాల్ల పదిహేనుకు తక్కువియ్యనంటున్నడు. నీ భూమిరోడ్డుపక్కనుంటే నేనే ఇంత జెల్ది తియ్యొద్దంటుంటి. సూస్తూండు ఆర్నెల్లల్ల యాభై దాటుతది..." ఆపై ఏమేమో చెప్పుకొచ్చాడు- బట్టతల- మోకాలి చిప్ప సామెతలా.

తన పక్క పొలం ఏడింటికి బేరం కావడం తెలిసిన శివానంద కనీసం కొంచెం అటూ ఇటుగానైనా వస్తుందన్న అవకాశం కనిపించక పోవడంతో ఇంకోచోట ప్రయత్నిద్దామనుకుంటూ వెనుదిరిగాడు.

"ఆఖరు ఆరుకాడికి ఒప్పిస్త అన్నా. నీ యిష్టం. ఆలోచించుకో..." బయటికొచ్చేస్తున్న శివానందకు వినిపించేలా అన్నాడు జానీ.

డబ్బు ఏదో విధంగా సర్దుబాటు అవుతుందన్న నమ్మకం కల్గగానే శ్రీనివాస్ వాళ్ళింటికి ఫోన్‌చేసి విషయం చెప్పాడు శివానంద. ఆ సమయంలో శ్రీనివాస్ ఇంట్లో లేకపోవడం యాదృచ్ఛికం.

★ ★ ★

రాత్రి భోజనాలవద్ద సద్గుణ శివానంద ఫోన్ ద్వారా తెలియజేసిన విషయం చెప్పింది భర్తకు. కాకపోతే అతను ఎక్కడ డబ్బుల ప్రస్తావన తెస్తాడోనని ముందు చూపుగా కొడుకు విదేశాలకెళ్ళే అవకాశం వచ్చిందని, డబ్బులకోసం తీవ్ర యిబ్బందిగా ఉందని అతనితో అన్న విషయం దాచి పెట్టింది.

మిత్రుడు 'శివ' విషయం వినడంతోనే ఆలోచనలో పడిపోయాడు శ్రీనివాస్.

మిత్రుని పట్ల భర్తకున్న మమకారం తెలిసిన సద్గుణ ఆయనంత తీవ్రంగా ఆలోచించడాన్ని భరించలేకపోతోంది-

"అయ్యో! ఇప్పుడేం కొంపలంటుకుపోయాయని అంత ఇదైపోతారు? ఆయన అన్ని ఏర్పాట్లూ చేసుకుంటున్నాడట." తనకు తోచినంత కల్పించి చెబుతూనే - "ఇంకా నయం... మీ స్నేహితుడు తెగ కష్టపడిపోతున్నాడని హైరానా పడిపోయి బాబుకోసం ఏర్పాటుచేసుకుంటున్న డబ్బులతనికిచ్చేస్తాననలేదు..." అంది గడుసుగా.

ఉలిక్కి పడ్డాడు శ్రీనివాస్. 'నువ్వు చంపినా సరే పెట్టెలో నగలు దాచి పెట్టిన రహస్యం నీకు చెప్ప'నన్నట్టున్నది సద్గుణ వ్యవహారం. సమస్యనూ, సమాధానాన్నీ తనే అందించిన సద్గుణను ఒక్క క్షణం జాలిగా చూశాడు.

శివ సంగతి నాకు తెలుసు. వేసవిలో పెళ్ళి అన్నవాళ్ళు ఇప్పటికిప్పుడు హఠాత్తుగా నిశ్చితార్థం కావాలంటే వాడెక్కడినుండి తెస్తాడు? ఆలోచించగా ఓ పరిష్కారం లభించినట్లైంది. ఆ సాయంత్రమే కొడుకుతో ఓ ఇరానీ హోటెల్లో మాట్లాడాడు శ్రీనివాస్.


"ఋషీ! నీకెంత మంది స్నేహితులున్నారో నాకు తెలీదు కాని నాకున్నది ఒకే ఒక్క మిత్రుడు. వానికోసం నువ్వో చిన్న సాయం చేయాలిరా!" అతని కళ్ళలో నీళ్ళు.

కంగారుపడిపోయాడు ఋషి. తండ్రికున్న ఏకైక స్నేహితుడు శివానంద అన్న సంగతి అతనికి తెలుసు. కాని, అతనికే ఆపద కల్గిందో ఊహించలేకపోతున్నాడు- "శివానంద అంకుల్ గురించే గదా... ఏం జరిగింది?"

శివానంద పరిస్థితి అంతా చెప్పాడు శ్రీనివాస్- "ఇప్పటికిప్పుడు లక్ష రూపాయలు కావాలంటే వాడెక్కడ తేగలడు. అసలే ఊర్నిండా అప్పులు. అందుకే ఇప్పట్లో అమ్మాయిల పెళ్ళిళ్ల గురించి వాడాలోచించలేదు. కాని అనుకోకుండా సంబంధం కుదిరింది. సమ్మర్ వరకూ సమయమున్నది కదా- కొంత పొలం అమ్మి అప్పులు తీర్చి, శ్రావణి పెళ్ళి చేయాలనుకున్నాడు. కాని, పరిస్థితి ఇలా వస్తుందని ఊహించి ఉండడు... ..."

తాను చేయగలిగిందేమిటో అర్థంకాలేదు ఋషికి. అదే అడిగాడు తండ్రిని.

"ఋషీ! స్నేహితుని అవసరం గ్రహించి, అడగకుండానే సాయపడటం నిజమైన స్నేహం రా. నేనిప్పుడు శివకి సాయపడాలంటే నీవు నాకు సహకరించాలి......"



**"ఇప్పటికిప్పుడు లక్ష రూపాయలు కావాలంటే వాడెక్కడ తేగలడు. అసలే ఊర్నిండా అప్పులు. అందుకే ఇప్పట్లో అమ్మాయిల పెళ్ళిళ్ల గురించి వాడాలోచించలేదు. కాని అనుకోకుండా సంబంధం కుదిరింది. సమ్మర్ వరకూ సమయమున్నది కదా- కొంత పొలం అమ్మి అప్పులు తీర్చి, శ్రావణి పెళ్ళి చేయాలనుకున్నాడు. కాని, పరిస్థితి ఇలా వస్తుందని ఊహించి ఉండడు..."**

కొంచెం కొంచెం అర్థం కాసాగింది ఋషికి.

"ఎంతో కష్టపడి సంపాదించుకున్న ఈ ఆపర్చునిటీ చేజారిపోతుందని బాధపడకు. కొంచెం ఓపిక పడితే ఇంతకంటే మంచి ఆఫర్ నీకు వచ్చే అవకాశమున్నది. కాని, ఈ కాలంలో ఆడపిల్ల పెళ్ళి ఎంత కష్టమో నాకు తెలుసు. 'శివ' ఉత్త అమాయకుడురా. వానికి తగినట్టు భగవంతుడు వాని కూతురుకి మంచి సంబంధం జత చేశాడు. ఇది పోతే......"

ఋషి చాలా సేపటిదాకా సమాధానం చెప్పలేదు. 'ఏ తండ్రి అయినా ఇట్లా ఆలోచిస్తాడా? అసలే ఈ అవకాశం ఆలస్యంగా లభించింది. ఏం స్నేహమో...!?' తండ్రి కళ్ళలోకి చూశాడు. అక్కను అత్తారింటికి పంపేటప్పుడు కూడా అతని మొహంలో అంత దైన్యం కనిపించలేదు.

"మీ యిష్టం..." అనగలిగాడు.

"ఈ సంగతి అమ్మతో చెప్పకు. నీకోసం కూడా నేను వేరే ఏర్పాట్లు చూస్తాననుకో" సంతోషం, విచారం కలిగలిసింది శ్రీనివాస్ గొంతులో.

★ ★ ★

"మామయ్యా! ఏంటిది, ఇలా షాకిచ్చారు?" హఠాత్తుగా గుమ్మంలో ఎదురైన శివానంద చిన్న కూతురు శ్రీవాణి శ్రీనివాస్‌ని చూసి కంగారు పడిపోయింది.

కూతురు మాటల్తో బయటికొచ్చిన గిరిజ కూడా ఆశ్చర్యపోయింది. "రండి రండి అన్నయ్యా!" ఆనందంతో ఆహ్వానించింది.

"వాణీ! మీ నాన్న వీరేశం వాళ్ళింట్లో ఉంటాడు పిలుచుకురాపో!" అంటూ కూతురుకి పురమాయించింది.

"పెళ్ళికూతురేదీ?" వీడు పొలమెళ్ళలేదా?" సరదాగా పలకరిస్తూ గిరిజ ఇచ్చిన నీళ్ళతో కాళ్ళు కడుక్కొని ఇంట్లోకడుగుపెట్టాడు శ్రీనివాస్.

"అది వాళ్ళ స్నేహితురాలింటికి వెళ్ళింది- పక్క ఊరే. ఈయన మూణ్రోజులుగా పొలమెళ్ళడం లేదు."

మాటల్లోనే శ్రీవాణి వచ్చి, తండ్రి ఊరికెళ్ళానని చెప్పాడట. వికారాబాద్‌కే గావచ్చు, సాయంత్రానికి వస్తానని వీరేశం బాబాయ్ వాళ్ళతో చెప్పాడనీ కబురు మోసుకొచ్చింది.

భోజనం వడ్డించింది గిరిజ. నిశ్చితార్థం సంగతులన్నీ పూసగుచ్చినట్టు చెప్పింది శ్రీనివాస్‌కి. చివర్లో భర్త డబ్బులకోసం ఇబ్బందిపడ్తున్న సంగతీ చెప్పింది.

"నాకు తెలుసమ్మా! ఇంత కష్టమొచ్చినా నేనున్నానే సంగతి గుర్తుకొచ్చిందా వాడికి? ఈసారి కనబడమను చెప్తా. అసలు నా గురించి వాడేమనుకుంటున్నాడో..." హాస్యం, నిష్ఠూరం కలగలిసింది శ్రీనివాస్ గొంతులో.

"మీ ప్రస్తావన వచ్చిందన్నయ్యా. 'పోయినేడే అమ్మాయి పెళ్ళి చేశారుగదా' అనుకున్నాం. అయినా ఆయనకు కష్టమొచ్చినా, సుఖమొచ్చినా ఆ దేవునికంటే ముందు గుర్తొచ్చేది మీరే..." గిరిజ గొంతులో ఆర్ద్రత.

"నాకు తెలుసమ్మా నాకు కూడా ముందు గుర్తొచ్చేది నీ దేవుడే."

ఆమె బుగ్గలు విచ్చుకున్నాయి. సంతోషంతో నవ్వింది గలగలా శ్రీవాణి.

"ఇదిగో! ఇవి లక్షా పదివేలున్నాయి. జాగ్రత్తగా తీసిపెట్టు."

భోజనానంతరం హడావుడిగా బయల్దేరుతూ బ్యాగ్‌లో నుండి డబ్బు తీసి గిరిజ చేతిలో పెట్టాడు. "వాడు రాగానే చెప్పు. ఎవరినీ అడగనవసరం లేదని. ముందు ఈ పని కానీయండి, తర్వాత విషయాలన్నీ నెమ్మదిగా పూర్తిగానిచ్చేద్దాం. ఈ సంగతి మీ వదినెకి ఇప్పుడిప్పుడే తెలియనివ్వకండి..." అంటూ గిరిజను మాట్లాడనీయకుండా అన్ని విషయాలూ చెప్పి తిరుగు ప్రయాణమయ్యాడు శ్రీనివాస్.

★ ★ ★

"ఏం స్నేహితులండీ? ఆగమంటే ఆగకుండా అలా వెళ్ళిపోయాడు? మీ ఆఫీసుకి ఫోన్ చేస్తే, ఈరోజు సెలవుపెట్టారని చెప్పారు. ఎక్కడికెళ్ళారు?" సాయంత్రం ఇంట్లోకి అడుగుపెడ్తూనే అర్ధాంగి సద్గుణ స్వాగత వచనాలు శ్రీనివాస్‌కి.

"ఏంటీ, వాడిక్కడికొచ్చాడా?" 'నేనక్కడికెళ్ళానే?' అనబోయి తమాయించుకున్నాడు శ్రీనివాస్.

"ఆఁ! వచ్చాడు. వద్దన్నా వినకుండా ఈ డబ్బులిచ్చి వెళ్ళాడు. మీరేమో అతను చాలా కష్టపడి పోతున్నాడంటూ తెగ ఇదైపోయారు. ఆయన్ని చూస్తూంటే ఏ కష్టమూ లేనట్టుంది. లేకపోతే కూతురు నిశ్చితార్థం పెట్టుకొని, లక్ష రూపాయలిచ్చి వెళ్తాడా?...."

ఆశ్చర్యంతో నోట మాట రాలేదు శ్రీనివాస్‌కి.

తండ్రి ప్రతిపాదనతో పిచ్చెక్కిన ఋషి, స్నేహితుల మాటల్తో మరింత రెచ్చిపోయాడు. విషయమంతా అమ్మకు చెప్పి నానా బీభత్సం సృష్టించాలన్న ఆవేశంతో ఇంటికొచ్చాడు. అక్కడ జరిగిందంతా చూశాడు.

'ప్రతి మనిషికీ మీలాంటి మంచి మిత్రుడు ఒక్కడైనా ఉండాలి నాన్నా!' మనసులోనే అభినందించాడు- ఆనంద బాష్పాలతో. ★